

19 వ వసంతంలోకి ...

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

సోమవారం 3 నవంబర్ 2025 పేజీలు 8




## నేటి తరం ఉద్యోగులకు ఆదర్శం

# జాస్తి వెంకట లక్ష్మి

- 40 ఏళ్ల వెంకట లక్ష్మి సేవలు అభినందనీయం
- పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు, ఎ.పి.ఎన్.జి.ఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్

**విజయవాడ, నవంబర్ 2, మేజర్ న్యూస్ :** ప్రభుత్వానికి వారధి అయిన సమాచార పౌర సంబంధాల శాఖలో అత్యంత సమర్ధవంతంగా సేవలందించి అధికారుల మన్నల పొందిన జాస్తి

వివరాలు 2లో

# అవినీతిపై పోరాటానికి

## ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

**ఏసీబీ డైరెక్టర్ జనరల్ అతుల్ సింగ్**

**విజయవాడ, నవంబర్ 2, మేజర్ న్యూస్ :** మన సమాజ అభివృద్ధికి అవినీతి అవరోధంగా ఉందని దాన్ని పారదోలాల్సిన అవసరం ఉందని ఏసీబీ డైరెక్టర్ జనరల్ అతుల్ సింగ్ అన్నారు.. విజిలెన్స్ అవేర్నెస్ వీక్ – 2025 లో భాగంగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆదివారం ఉదయం సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీబీ డైరెక్టర్ జనరల్ అతుల్ సింగ్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి రోజున అవినీతికి వ్యతిరేకంగా విజిలెన్స్ మిగతా 2లో...





## దొంగ ప్రమాణం చేశాడు

# జోగి రమేష్ పాపం పండింది

- తప్పులు చేయటం వైసీపీ డి.యన్.ఎ.లోనే వుంది
- ఈ అరెస్ట్‌తో ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదు
- సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లపై నిందలు మోపడం దుర్మార్గం
- జనార్ధన్ రావు ఇచ్చిన సమాచారంతో జోగి రమేష్ అరెస్టు
- జోగి రమేష్ విచారణలో వై.ఎస్.జగన్ పేరు చెప్పటం ఖాయం
- ఈ నకిలీ మద్యం కుంభకోణంలో జగన్‌కి కూడా సంబంధం వుంది
- మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న

**విజయవాడ మేజర్ న్యూస్ :** వైసీపీ నాయకులు తప్పులు చేయటం, దోచుకోవటం, దాచుకోవటం బాగా అలవాటు..డైవర్షన్ పాలిటిక్స్ కి పెట్టింది పేరు వైసీపీ...తప్పులు చేయటమనేది వాళ్ల డి.ఎన్.ఎలోనే వుంది. అందుకే నకిలి మద్యంలో కేసులో సంబంధం వున్న జోగి రమేష్ అమ్మవారి ముందు దొంగ ప్రమాణం చేశాడు...అందుకే పాపం పండి అరెస్టు కావటం జరిగిందని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న అన్నారు.నకిలీ మద్యం కేసులో జోగి రమేష్ అరెస్ట్ పై ఆదివారం గురునానక్ కాలనీలోని ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బుద్దా వెంకన్న మాట్లాడుతూ నకిలీ మద్యం కేసులో అరెస్ట్ అయిన జనార్ధన్ రావు ఇచ్చిన స్టేట్ మెంట్ ఆధారంగానే జోగి రమేష్ ను సిట్ అధికారులు, పోలీసులు అరెస్ట్ చేయటం జరిగిందని తెలిపారు.ఈ అరెస్ట్ కు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎలాంటి సంబంధం లేదన్నారు. తన అరెస్ట్ గురించి ముందే గ్రహించిన జోగి రమేష్ తన స్థాయి పెంచుకోవటానికి మిగతా 2లో...

డా. బీఆర్ అంబేద్కర్ స్మృతివనం నిర్వహణపై

# ప్రత్యేక దృష్టి

- మహనీయునిపై గౌరవాన్ని ఇనుమడింపజేసేలా కార్యక్రమాలు
- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

2



(మొదటిపేజీ తరువాయి)



## నేటి తరం ఉద్యోగులకు ఆదర్శం జాస్తి వెంకట లక్ష్మి

వెంకట లక్ష్మిని నేటి తరం ఉద్యోగుల ఆదర్శంగా తీసుకోవాలని పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ ఎస్.దిల్లీరావు అన్నారు. విజయవాడ రాష్ట్ర సమాచార కేంద్రం, లైబ్రేరియన్‌గా పనిచేసి ఇటీవల పదవీ విరమణ చేసిన జాస్తి వెంకట లక్ష్మికి తాడేపల్లిలోని కొండపావులూరి గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన అభినందన కార్యక్రమానికి పౌర సరఫరాల డైరెక్టర్ ఎస్.ఢిల్లీ రావు, ఎ.పి. ఎన్.జి.ఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్‌లు హాజరై వెంకటలక్ష్మి ప్రసాద్ దంపతులను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ ఎస్.దిల్లీరావు మాట్లాడుతూ దాదాపు 40 సంవత్సరాలుగా వెంకట లక్ష్మి ఉద్యోగ భాధ్యతలను నిర్వర్తిస్తూ తమదైన శైలిలో సేవలు అందించారని అన్నారు. ఆమె అందించిన సేవలు నేటి తరం వారికి స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. ఎన్‌జి ఓ నేత విద్యా సాగర్ మాట్లాడుతూ ప్రభుత్వానికీ ప్రజలకు వారిదిలా నిలిచే సమాచార శాఖలో పనిచేసే ఉద్యోగులు సమర్ధవంతంగా పనిచేస్తేనే ప్రభుత్వాని మంచి పేరు వస్తుందన్నారు. వెంకట లక్ష్మి ప్రసాద్ దంపతులు యిరువురు సమాచార శాఖలో పని చేసి ప్రజా పతినిధులు ఉన్నతాధికారుల పర్యటనలకు సంబంధించి సమాచారం ఎప్పటికప్పుడు మీడియా అందజేయటం మీడియా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ మంచి సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమం ఎన్ జి ఓ నేతలు కె.జగదీశ్వర రావు డి ఎస్ ఎన్ రెడ్డి పి.రమేష్ సి వి ఆర్ ప్రసాద్ నజీరుద్దీన్ రివర్ బ్రిజ్ అపార్టుమెంట్ సభ్యులు పాల్గొన్నారు.

## డా. బీఆర్ అంబేద్కర్ స్మృతివనం నిర్వహణపై ప్రత్యేక దృష్టి

**మహనీయునిపై గౌరవాన్ని ఇనుమడింపజేసేలా కార్యక్రమాలు**

**అభివృద్ధిపై సమన్వయ శాఖల అధికారుల నిరంతర పర్యవేక్షణ**

**ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**ఎన్‌టీఆర్ జిల్లా, నవంబర్ 02, మేజర్ న్యూస్ :** నవ భారత రాజ్యాంగ నిర్మాత, దేశాభ్యుదయానికి జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి డా. బీఆర్ అంబేద్కర్ అని.. ఆయన ఆశయాలను, మేధో సంపత్తిని తరతరాలకు అందించేందుకు ఆయన పేరిట ఏర్పాటుచేసిన స్మృతివనం నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించిందని, మహనీయునికి విశిష్ట గౌరవం కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ..రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎంలతో కలిసి సమన్వయ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డా. బీఆర్ అంబేద్కర్ స్మృతివనానికి సంబంధించిన అభివృద్ధి కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ స్మృతివనం నిర్వహణలో ఎలాంటి అలసత్వానికి చోటులేదని, ఇప్పటివరకు నిర్వహణ బాధ్యతలు చూసిన కాంట్రాక్టు సంస్థను తొలగించాలని ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు, ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలని ఆ సంస్థను ఆదేశించామని తెలిపారు. ఈ ఆదేశాలను బేఖాతరు చేస్తే బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని హెచ్చరించారు. స్మృతివనం నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖలకు అప్పగించడం జరిగిందన్నారు. ఈ శాఖల ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం నిరంతర ప్రత్యక్ష పర్యవేక్షణ ఉంటుందని, ఇందులో భాగంగా ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ డా. బీఆర్ అంబేద్కర్ ఆశయాలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలిచేలా నిరంతర అభివృద్ధికి కృషిచేయడం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సమావేశంలో విజయవాడ నగరపాలక సంస్థ, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖలు, ఏపీఐఐసీ, సాంఘిక సంక్షేమం తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దొంగ ప్రమాణం చేశాడు జోగి రమేష్ పాపం పండింది



(మొదటిపేజీ తరువాయి)

సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ నిందలు మోపడం జరిగిందన్నారు. జోగి రమేష్ ఒక బచ్చా అంటూ.... రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావాలనే సంకల్పంతో కృషి చేస్తున్న సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేష్ కు జోగి రమేష్ గురించి ఆలోచించేంత తీరక లేదన్నారు.జనార్ధన్ రావు నకిలీ మద్యంలో కేసు లో జోగి రమేష్ కి సంబంధం వుందని వాంగ్మూలం ఇచ్చిన తర్వాతే జోగి రమేష్ పై సిట్, పోలీసులు అధికారులు దృష్టి పెట్టడం జరిగిందన్నారు. ఇప్పుడు అరెస్ట్ అయిన జోగి రమేష్ విచారణలో నకిలీ మద్యం వెనక వున్న అసలు కీలక సూత్రధారి వై.ఎస్.జగన్ పేరు చెప్పటం ఖాయమన్నారు.దొంగతనం చేసి ప్రతి దొంగ ముందు తాను నిర్ధోషినే అంటాడు...పోలీసుల విచారణలో అన్ని నిజాలు బయటకు వస్తాయని, అలాగే జనార్ధన్ రావు పోలీసులు విచారణలో జోగి రమేష్ పేరు బయటికి వచ్చిందన్నారుతప్పు చేసిన దొరికిపోయిన జోగి రమేష్ తన అరెస్ట్ సమయంలో కులం గుర్తు రావటం సిగ్గు చేటు అన్నారు. బీసీ అని చెప్పుకుంటున్న జోగి రమేష్ తనకు వున్న వందల కోట్లు రూపాయలు బీసీలకు పంచిపెట్టాలన్నారు. తన అరెస్ట్ ను డైవర్షన్ చేయటానికి జోగి రమేష్ రకరకాలు ప్రయత్నాలు చేశాడన్నారు. ఈ రాష్ట్రంలో బీసీలకు అధికారం హక్కును తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు కల్పిస్తే..ఆ తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు కొనసాగించారన్నారు.వాళ్ల వల్లే వై.ఎస్ జగన్ బీసీలకు వైసీపీలో అరకొర పదవులు ఇచ్చాడు. రాష్ట్రంలో బీసీలకు వెలుగు నిచ్చింది తెలుగుదేశం పార్టీ అంటూ ఉద్ఘాటించారు. తను బీసీ కాబట్టే అరెస్ట్ చేస్తున్నారని జోగి రమేష్ మాట్లాడితే నమ్మటానికి ప్రజలెవ్వరూ సిద్దంగా లేరన్నారు. బీసీ కార్డ్ మీద లబ్ది పొందిన జోగి రమేష్ ఒక బీసీకి సాయం చేసిన దాఖలాలు లేవన్నారు. జగన్ మోహన్ రెడ్డి పాలనలో ఎంతో మంది బీసీల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ఆ సమయంలో జోగి రమేష్ కు బీసీ లు ఎందుకు గుర్తు రాలేదంటూ ప్రశ్నించారు. పోలీసులు అరెస్ట్ చేసే సమయంలో కులం గుర్తు రావటం చాలా దురదృష్టకరమన్నారు. వై.ఎస్.జగన్ తన హయంలో నకిలీ మద్యం తయారు చేయించి అమ్మటం ఒక అలవాటుగా మారింది. అందుకే డిజటల్ పేమెంట్స్ వైన్స్ షాపుల దగ్గర తీసివేశారు. ఈ మద్యం కుంభకోణం కేసులో కూడా తాడేపల్లి ప్యాలెస్ కు డబ్బు చేరినట్లు చెప్పారు. నకిలీ మద్యం కేసులో జోగి రమేష్ వెనుక జగన్ ఉన్నాడన్నారు. అందుకే ఈ వ్యవహారం గత ప్రభుత్వం లో బయటకు పొక్కలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఈ నకిలీ మద్యం వెలుగులోకి తీసుకురావటం జరిగిందన్నారు. టీడీపీ తరుపున జయచంద్రారెడ్డి పోటీ చేసిన సరే అరెస్ట్ చేయటం జరిగిందని, తక్షణం సీఎం చంద్రబాబు పార్టీ నుంచి సస్పెండ్ చేయటం జరిగిందన్నారు. వైసీపీ నాయకులు ఒక పథకం ప్రకారమే జయచంద్రారెడ్డి ను టీడీపీలో పంపించటం జరిగిందన్నారు.నకిలీ మద్యం కేసుకి సంబంధించి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ వచ్చి ప్రమాణాలు చేయాలని జోగి రమేష్ అడగటం. తను తప్పు చేయలేదని అమ్మవారి గుడిలో ప్రమాణం చేయటంతో పాపం పండిందన్నారు. ఈ కేసు కి వాళ్లకి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. జగన్ మోహన్ రెడ్డి బాబాయ్ వివేకా నందరెడ్డిని హత్య చేయించాడు...42 వేల కోట్లు దోచుకున్నాడు..హత్య చేయించలేదని, డబ్బులు దోచుకోలేదని ప్రమాణం చేస్తే తప్పు చేయనట్లేనా అంటూ ప్రశ్నించారు.వైసీపీలో జగన్ పెద్ద దొంగ అయితే జోగి రమేష్ లాంటి నాయకులు చిన్న దొంగలు అంటూ చురకలు అంటించారు. దమ్ము అరెస్ట్ చేయాలన్న జోగి రమేష్ పోలీసులు వచ్చే సరికి పిల్లిగా బాత్ రూమ్ లో పారిపోయి దాగున్నాడని ఎద్దేవా చేశారు. తప్పు చేశాధు కాబట్టే పోలీసుల ఎదుట నిలబడి సమాధానం చెప్పలేక పోతున్నాడన్నారు.వైసీపీ పాలనలో తనతో పాటు టీడీపీ నాయకుల్ని అరెస్ట్ చేయటానికి ఎన్నో పోలీసులు వచ్చారు. తాము తప్పు చేయలేదు కాబట్టి పోలీసులను చూసి పారిపోలేదని, ధైర్యంగా నిలబడి పోరాడమన్నారు. జోగి రమేష్ కు నిజాయితీ లేదు కాబట్టే పోలీసుల్ని చూసి పారిపోవటానికి ప్రయత్నించాడన్నారు. ఏ ప్రభుత్వంలోనైనా ఎమ్మెల్యేలు అవినీతి చేస్తే జైలు వెళ్లాల్సిందేనన్నారు. రాష్ట్రాన్ని వైసీపీ నాయకులు నాశనం చేశారు. ఇందులో ప్రధాన పాత్ర జగన్ మోహన్ రెడ్డి పోషిస్తే ఆ తర్వాత పాత్ర జోగి రమేష్ పోషించాడన్నారు.వైసీపీ నాయకులు నకిలీ మద్యం సరాఫరా చేసి రాష్ట్రంలోని ప్రజలకు స్లో పాయిజన్ ఇచ్చారని మండిపడ్డారు. ప్రజల ప్రాణాలు తీసి డబ్బులు దోచుకోవటం జరిగిందన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళతామన్నారు. వైసీపీ నాయకులు ఇంకా ఓవర్ యాక్షన్ చేస్తే నకిలీ మద్యం తాగి చనిపోయిన వారి కుటుంబ సభ్యులతో తాడేపల్లి ప్యాలెస్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు.జోగి రమేష్ మంచోడని మరో దొంగ జగన్ సర్టిఫికేట్ ఇవ్వడం విశేషమన్నారు. జనార్ధన్ అంత స్పష్టంగా చెప్పినా జగన్ చిలక పలుకులు పలకటం ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. మద్యం షాపుల్లో ఆన్ లైన్ లావాదేవీలు లేకుండా చేసి జగన్ కోట్ల రూపాయాలు దోచుకున్నాడన్నారు. వైసీపీ నాయకులు వై.ఎస్ జగన్ ఎన్ని డ్రామాలు ఆడినా, కల్తీ మద్యం కేసులో పాత్రధారులు, సూత్రధారులు అందరూ జైలుకు వెళ్లడం ఖాయమన్నారు.ఈ మీడియా సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వక కార్యదర్శి బొప్పన భవ కుమార్, టీడీపీ రాష్ట్ర నాయకులు నరసింహ చౌదరి, మాదిగాని గురునాధం పాల్గొన్నారు.

# అవినీతిపై పోరాటానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి









(మొదటిపేజీ తరువాయి)

అవేర్‌నెస్ వీక్‌ను చేపట్టడం జరుగుతుందన్నారు. నవంబర్ రెండో తారీకు వరకు దీనిపై ప్రజల్లో దేశవ్యాప్తంగా అవగాహన కల్పిస్తారన్నారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించడానికి విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా సైకిల్ ర్యాలీని చేపట్టామన్నారు. రాష్ట్రంలో విజయవాడ, విశాఖపట్టణం, తిరుపతిలలో కూడా సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజ అభివృద్ధికి అడ్డుగోడగా ఉన్న అవినీతిని పారదోలాల్సి ఉందన్నారు. అవినీతి అనేది రెండువైపులా అంటే ఇచ్చే వారు పుచ్చుకునే వారిపై ఆధారపడి ఉంటుందన్నారు. ఏదైనా అవినీతిపై మీరు ఫిర్యాదు చేయాలనుకుంటే 1064 కు కాల్ చేయవ చ్చాన్నారు. దీనిపై వెంటనే అవినీతి నిరోధక శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు.. అవినీతిపై పోరాటంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నుంచి మనకి చాలా సపోర్టు ఉందని తెలిపారు.. ఉదయమే సైకిల్ ర్యాలీలో పాల్గొన్న అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుండి ప్రారంభమైన సైకిల్ ర్యాలీ బెంజ్ సర్కిల్ బందరు రోడ్డు మీదుగా పోలీస్ కంట్రోల్ రూమ్ నుండి ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం కు చేరుకుంది. సైకిల్ ర్యాలీలో ఎసిబి డైరెక్టర్ ఆర్. జయ లక్ష్మి, హెడ్ క్వార్టర్స్ అడిషనల్ ఎస్పీ సుధాకర్, అడిషనల్ ఎస్పీలు మహేందర్, దిలీప్ కిరణ్, ఏసీబీ అధికారులు, యువత పాల్గొన్నారు.



# కాపులపై టీడీపీది కుల వివక్ష, సవతి తల్లి ప్రేమే..

## సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేష్‌కు కెఆర్‌పిఎస్ బహిరంగ లేఖ

### వైసీపీ, కాంగ్రెస్‌ను అనుసరిస్తున్నారంటూ ఆరోపణ

**అమరావతి మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుకి, మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కి, ఉపముఖ్యమంత్రులతో సహ మంత్రులందరికీ కెఆర్ పిఎస్ పక్షాన బహిరంగలేఖ పంపినట్లుగా, కులాలకు, మతాలకు అతీతంగా దయచేసి ఈ బహిరంగ లేఖను పరిశీలించాల్సిందిగా కెఆర్ పిఎస్ (కాపు రిజర్వేషన్ పోరాట సమితి) పక్షాన ఆదివారం కెఆర్ పిఎస్ రాష్ట్ర కన్వీనర్ రావి శ్రీనివాస్, కెఆర్ పిఎస్ రాష్ట్ర చైర్మన్ సిహెచ్. చనమల్ల ప్రసాదరావు ఓ ప్రకటనలో కోరారు. లేఖలో ముఖ్యంగా టీడీపీ కూటమి ప్రభుత్వంవారు కాపు, తెలగా, బలిజ, ఒంటరి కులాల వారిపట్ల కుల వివక్షను చూపిస్తున్నారని, సవతితల్లి ప్రేమను చూపిస్తున్నారని తాము బలంగా ఆరోపిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కాపుల విషయంలో నీలం సంజీవరెడ్డిని, కాసు బ్రహ్మానందరెడ్డిని, వై.యస్. రాజశేఖరరెడ్డిని, వై.యస్. జగన్మోహన రెడ్డిని తూ.చ. తప్పకుండా అనుసరిస్తున్నారని బలంగా నమ్ముతున్నామనని తెలిపారు. టీడీపీవారు ఎన్.డి.ఎ. ప్రభుత్వంలో కొనసాగుచున్నప్పటికీ రాజ్యాంగ విరుద్ధమైన మైనార్టీల రిజర్వేషన్ల విషయంలో గానీ, ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలు విషయంలో పాటిస్తున్న నియమ నిబంధనలలో ఆయా అంశాలకు సంబంధించి ఎన్.డి.ఎ. విధానాలకు విరుద్ధంగా టీడీపీవారు కాంగ్రెస్, వై.సి.పి. వారి విధానాలను అనుసరిస్తున్నారని తాము బలంగా ఆరోపిస్తున్నా మని, టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నేటి వరకూ కాపుల ప్రయోజనాలను కాపాడే విధంగా కనీసం ఒక్క నిర్ణయం కూడా తీసుకోలేదని, కాపు కార్పొరేషన్ పూర్తిగా నిర్వీర్యమైపోయిందని తెలియజేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కాపులపట్ల దశలవారీగా కవ్వింపు చర్యలకు పాల్పడటం జరుగుతోందనే ఇటీవల జరిగిన ఎన్నో సంఘటనలు నిరూపిస్తున్నాయని తెలిపారు ఉపముఖ్యమంత్రిగా నారా లోకేష్ కి కూడా పట్టంగట్టి క్రమేణా పవన్ కల్యాణ్ ప్రాధాన్యతను తగ్గించాలనే ఉద్దేశ్యంతో టీడీపీ కేడర్తోటే ముందుగా లీక్లు ఇప్పించి సోషల్ మీడియాలో వచ్చిన విపరీతమైన వ్యతిరేకతతో వెనకకు తగ్గారని, దొమ్మర కులంవారిని గిరిబలిజలుగా మారుస్తూ జి.ఓ. ఇచ్చి బలిజల యొక్క ఆత్మగౌరవం మీద దెబ్బకొట్టడం, ఆ జి.ఓ. పై బలిజ, కాపు సంఘాలు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తడంతో పాటు, ఉద్యమానికి సిద్ధమైన తరుణంలో ఆ జి.ఓ.ను పూర్తిగా రద్దుచేయకుండా స్టేటస్ కో ఇవ్వడం, శాసనసభలో నందమూరి బాలకృష్ణ ఉద్దేశ్యపూర్వకంగా చిరంజీవిని అవమానించేలా మాట్లాడటం, తద్వారా తలెత్తిన తదితర పరిణామాలు, కందుకూరు-దారకానిపాడులో బలిజ కుటుంబం మొత్తాన్ని తుదముట్టించేలా జరిపిన మారణ కాండను స్థానిక ఎమ్మెల్యే, ఆ ప్రాంతానికి చెందిన గౌరవ మంత్రి వారిరువురు కలిసి కులరాజకీయం చేసి వారి కమ్మకులానికి అండగా నిలబడి ఆ దుర్మార్గమైన పాశవిక హత్యను, మారణకాండను వెలుగులోనికి రానీయకుండా నిందితులకు కొమ్ముకాయటం, ఆ దుర్మార్గాన్ని కాపు సంఘాల నాయకులు 10 రోజుల తరువాత వెలుగులోనికి తీసుకురావడంతో గత్యంతరం లేక ప్రభుత్వం స్పందించడం, ప్రభుత్వం ప్రకటించిన నష్ట పరిహారాన్ని సైతం కమ్మ సామాజికవర్గానికి చెందిన మాజీ ఇంటిలిజెన్స్ డి.జి. ఎ.బి, వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ వీడియో రిలీజ్ చేయడం వంటి కవ్వింపు చర్యల ద్వారా టీడీపీ బలమైన కమ్మ ముద్రను వేసుకోవడం.... మా ఈ ఆరోపణలపై టీడీపీ కూటమిలోని మూడుపార్టీల నుండి గౌరవ మంత్రివర్గ ఉపసంఘం వారు బహిరంగ చర్చకు ముందుకువస్తే మీడియా సమక్షంలో టీడీపీ కూటమి వారు ఏఏ అంశాలలో కుల వివక్ష చూపిస్తున్నారో, ఏఏ అంశాలపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారో ఉదాహరణలతో సహ వారి ద్వంద్వ నీతిని, ద్వంద్వ విధానాలను వివరించడానికి కెఆర్ పిఎస్ పక్షాన మేము సంసిద్ధంగా ఉన్నామని తెలియజేస్తామని కెఆర్ పిఎస్ రాష్ట్ర కన్వీనర్ రావి శ్రీనివాస్, కెఆర్ పిఎస్ రాష్ట్ర చైర్మన్ సిహెచ్. చనమల్ల ప్రసాదరావు లేఖలో ప్రస్తావించారు.

## 692మందికి వైద్య పరీక్షలు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు వైద్య శిబిరంలో ఆదివారం ఉచిత కార్పోరేట్ వైద్య పరీక్షలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 692మంది రోగులకు వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలున్న రోగులకు డాక్టర్ వెంకట్రావు, గుండె, ఊపిరి తిత్తులు తదితర సంబంధ వ్యాధులకు విజయవాడ కామినేని హాస్పటల్ వైద్యులు ఎస్.దాశరథి, డాక్టర్ భవాని, నేత్ర వైద్యానికి విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ హనుమకొండ దుర్గాభవాని, మానసిక రుగ్మతలకు హైదరాబాదుకు చెందిన డాక్టర్ హరిహర్ తమ వైద్య సేవలను రోగులకు అందించారు. అనంతరం ఉచిత మందులను పంపిణీ చేశారు.

## వేణుగోపాలునికి ప్రత్యేక పూజలు



**గుడ్లవల్లేరు నవంబరు 2 మేజర్ న్యూస్:** ఛాత్రు మాస దీక్ష పరి సమాప్తిని ఏకాదశి పురస్కరించుకొని గుడ్లవల్లేరు శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి వారి ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులకు అన్న ప్రసాదాలను అందించారు. తొలుత వేకువజామున స్వామివారికి పంచామతాలతో విశేషాభిషేకాలను చేపట్టారు. గీతా సమాజం భక్త బందంచే భగవద్గీత 18అధ్యాయాల పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వల్లభనేని సీతారాం, గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ అధినేతలు డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, వల్లూరుపల్లి బాబ్జి, వల్లూరుపల్లి రామకష్ణ, వల్లభనేని సుబ్బారావు, వల్లభనేని కష్ణప్రసాద్(నాని), శ్రీ కొండలమ్మ ఆలయ చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు, ప్రధానార్చకుడు అగ్నిహోత్రం ఫణిగోపాల్, అగ్నిహోత్రం పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## మొంథా తుఫాన్ యోధా అవార్డు గ్రహీతలకు ఎమ్మెల్యే సన్మానం






**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ధైర్య సాహసాలతో పని చేసిన ప్రతి ఒక్కరూ స్ఫూర్తిదాయకులు అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా సీఎం క్యాంపు కార్యాలయంలో మొంథా తుఫాన్ యోధా అవార్డులు అందుకున్న కోడూరు తహసీల్దార్ జలగం సౌజన్య కిరణ్మయి, అవనిగడ్డ గ్రామ సచివాలయం - 5 ఫిషరీస్ అ సిస్టెంట్ లేబాక నాగేంద్రబాబులను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో బుద్ధప్రసాద్, యువ నాయకుడు మండలి వెంకట్రామ్‌లు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

తుఫాన్ సమయంలో పునరావాస కేంద్రాలలో నియోజకవర్గ అధికార యంత్రాంగం ప్రతి ఒక్కరూ ఉత్తమ సేవలు అందించారని తెలిపారు. అవనిగడ్డ గ్రామ సచివాల యం-5 మత్స్య శాఖ అసిస్టెంట్ లేబాక నాగేంద్ర బాబు మాట్లాడుతూ నాగాయలంకలో తుఫాన్ విధు ల్లో భాగంగా ఈ నెల 28వ తేదీ సాయంత్రం కృష్ణానదిలోని కుటుంబరావు దిబ్బపై తుఫానులో చిక్కుకుని ఉన్న నలుగురు మేకల కాపరులను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాలతో, మత్స్య శాఖ జేడీ అయ్యా నాగరాజు, అసిస్టెంట్ డైరెక్టర్ ప్రతిభ దిశా నిర్దేశం మేరకు మండల అధికారుల అనుమతితో తుఫానులో బోటులో వెళ్లి సురక్షితంగా కాపాడినట్లు తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీకోసం...

### కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఈ నెల 3వ తేదీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక- మీకోసం కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతోపాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు.కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా జిల్లా కలెక్టర్ కోరారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**ఎన్టీఆర్ జిల్లా, నవంబర్ 02, మేజర్ న్యూస్ :** నవంబర్ 3వ తేదీ సోమవారం కలెక్టరేట్ లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్టు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అదేవిధంగా అర్జీదారులు తమ అర్జీలను Meekosam.ap.gov.in వెబ్సైట్‌లో నమోదు చేసుకోవచ్చని.. నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100కి నేరుగా కాల్ చేయవచ్చన్నారు.

## డిసెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** వచ్చే డిసెంబర్ నెల 13వ తేదీన రెండవ శనివారం జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు పూర్వపు ఉమ్మడి కృష్ణా జిల్లాలోని అన్ని న్యాయస్థానాల పరిధిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా సివిల్, కాంపౌండబుల్, క్రిమినల్ కేసులతో పాటు అన్ని రకాల కేసులు పరిష్కరిస్తామన్నారు. కావున ఈ అవకాశాన్ని కక్షిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రధాన న్యాయమూర్తి కోరారు.

## శ్రీపృథ్వీశ్వరస్వామిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** నడకుదురు శ్రీపృధ్వీశ్వరస్వామి వారి దేవాలయాన్ని పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జి. అనుపమ చక్రవర్తి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు వారికి స్వాగతం పలికారు. స్వయంభూ స్వామివారికి ప్రత్యేక పూజలు చేయగా, ఆలయ విశిష్టత, క్షేత్ర ప్రాధాన్యతను అర్చకులు తెలియచేసి ఆశీర్వచనాలు అందచేశారు.



## ఎర్రన్నాయుడుకి నివాళులర్పించిన టీడీపీ శ్రేణులు

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరం తెలుగుదేశం పార్టీ శాసనసభ్యుని వసంత కృష్ణ ప్రసాద్ కార్యాలయంలో కింజరపు ఎర్రన్నాయుడు వర్ధంతి సందర్భంగా ఆదివారం తెలుగుదేశం పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆశయాలకు సాధనకు అహర్నిశలు శ్రమించి, పార్టీ విధి విధానాలకు విధేయుడుగా, పేద బడుగు బలహీన వర్గాలకు అభ్యున్నతికి పాటుపడిన ఎర్రన్నాయుడుని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, తెలుగు యువత పాల్గొన్నారు.

## అవనిగడ్డలో ఘనంగా ఎర్రన్నాయుడు వర్ధంతి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి దివంగత కింజరాపు ఎర్రన్నాయుడు వర్ధంతి కార్యక్రమాన్ని తెలుగుదేశం నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఎర్రన్నాయుడు చిత్రపటానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి, పార్టీకి ఆయన అందించిన సేవలను, నిరుపేద ప్రజల పక్షాన ఆయన చేసిన పోరాటాలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. పార్టీ కోసం, ప్రజల కోసం ఎర్రన్నాయుడు చూపిన నిబద్ధత అందరికీ ఆదర్శప్రాయమని నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పర్చూరి దుర్గాప్రసాద్,బండే రాఘవ, షేక్ బాబావలి,దాసినేని శ్రీనివాసరావు,మేడికొండ విజయ్,కమ్మిలి సుబ్రమణ్యం, మెరుగు సోమిరెడ్డి,మెరుగు రంగనాథ్, కొండవీటి గోవింద్, కోట సాయి, జనసేన నేత కొట్టే విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత



**నాగాయలంక నవంబర్ 2 మేజర్ న్యూస్ :** నాగాయలంక మండలం పరచవర పంచాయతీ శివారు గనుపేశ్వరం గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ కార్యకర్త చాటగడ్డ సువార్తమ్మ మే తొమ్మిదోవ తేదీన రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఆమె భర్త బాబురావుకి ఐదు లక్షల రూపాయలు చెక్కును గణపతి శ్రీనివాసరావు ఆదివారం అందజేశారు ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు నాగాయలంక పార్టీ అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు పార్టీ నేతలు మంచాల బాబు పర్చూరు దుర్గాప్రసాద్ బండె రాఘవ మేడికొండ విజయ్ మంచాల మహేంద్ర చిక్కాల జైపాల్ చాటగడ్డ లీలమ్మ నీల రాజేష్ చాటగడ్డ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మీడియా సమావేశంలో అవనిగడ్డ నియోజకవర్గం అబ్జర్వర్ తెలుగు దేశం పార్టీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు.మీడియాతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తకు పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని వారి కుటుంబాలకు అండగా నిలుస్తామని నారా.లోకేష్ భరోసా ఇస్తున్నారని నియోజకవర్గంలో జరిగే విషయాలు అన్నింటి పైన తగిన పరిశీలన చేస్తున్నారని కార్యకర్తల సంక్షేమ కోసం వారు నిత్యం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం చేయుటకు కుటమీ ప్రభుత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు అవినీతి పరులపై చర్యలు తీసుకొను విధముగా ప్రయత్నించు చున్నారని తెలియపరిచారు.

# బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన తెలుగు తేజం ఎర్రన్నాయుడు

### పార్లమెంట్ కార్యాలయంలో ఎర్నన్నాయుడు వర్ధంతి కార్యక్రమం

### నివాళులర్పించిన ఎంపీ కేశినేని, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న



**విజయవాడ మేజర్ న్యూస్ :** బడుగు బలహీన వర్గాలకు అభ్యున్నతి కోసం కృషి చేసిన తెలుగు తేజం ఎర్రన్నాయుడు అందరి వాడంటూ దివంగత టీడీపీ నేత, కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు సేవలను ఎంపీ కేశినేని శివనాథ్ గుర్తు చేసుకున్నారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో ఎర్రన్నాయుడి 13వ వర్ధంతి కార్యక్రమం ఆదివారం జరిగింది. ఎంపీ కేశినేని శివనాథ్, మాజీ ఎమ్మెల్సీ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న తో కలిసి ఎర్రన్నాయుడు చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ రాజకీయాల్లోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే జాతీయ స్థాయి నాయకుడిగా ఎదిగిన కొద్దిమందిలో ఎర్రన్నాయుడు ఒకరన్నారు. సుదీర్ఘ కాలంపాటు శ్రీకాకుళం ఎంపీగా పదవీ బాధ్యతలు చేపట్టి...కేంద్ర మంత్రిగా వ్యవహరించారని, మూడు దశాబ్దాల పాటు గెలుపోటములతో సంబంధం లేకుండా రాజకీయాల్లో రాణించారన్నారు. రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి తుదిశ్వాస విడిచే వరకు తెలుగుదేశంలోనే కొనసాగారన్నారు. నిత్య కృషీవలుడిగా పేరుపొందిన ఎర్రన్నాయుడ్ని ఆదర్శంగా తీసుకుని ప్రజలకు సేవ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి బొప్పన భవకుమార్, టీడీపీ నాయకులు వి. నరసింహ చౌదరి, కె.జగన్ మోహన్, మాదిగాని గురునాథం, డాక్టర్ సంకె విశ్వనాథం, కొడూరు ఆంజనేయ వాసు, టి.ఎన్.ఎస్.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్ సాయి యాదవ్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



## నీతి నిజాయితీగా కష్టపడేతత్వం యాదవ జాతి సొంతం

### వన సమారాధనలు వసుదైక కుటుంబానికి సోపానాలన్న బండి రామకృష్ణ

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** వన సమారాధనలు వసుదైక కుటుంబానికి సోపానాలన్న బండి రామకృష్ణ గాంధీ విద్యాలయంలో జరిగిన యాదవ వన సమారాధన కార్యక్రమంలో మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ పాల్గొని ప్రసంగించారు. యాదవులతో తనకున్న అను బంధాన్ని బండి రామకృష్ణ నెమరు వేసుకుంటూ నీతి నిజాయితీగా కష్టపడేతత్వం యాదవ జాతికి సొంతమని వ్యాపారంలో భాగంగా యాదవులతో అత్యంత సాన్నిహిత్యం స్నేహం తనకు ఉన్నాయని అన్నారు ప్రతి యుగంలో యాదవులకు చరిత్ర ఉందని కలియుగ దైవం శ్రీవెంకటేశ్వర స్వామి జీసస్ క్రీస్తుతొలి దర్శనం యాదవులకే ఇవ్వడం యాదవ జాతి అదృష్టమని ద్వాపర యుగంలో శ్రీకృష్ణ పరమాత్ముడు వన సమారాధన జరిపి వసుదైక కుటుంబంగా జీవించాలని తెలిపారని ఆనాటి నుండి నేటి వరకు యుగాలు మారిన వన సమారాధన లక్ష్యం అదే అని ప్రకృతిని ఆరాధిస్తూ వనాలను రక్షిస్తూ కుల మతాలకు అతీతంగా అందరూ కలిసి వనభోజనాలను చేయడం మనలో స్నేహభావాన్ని పెంపొందించి కలిసిమెలిసి జీవనాన్ని గడపడానికి ఈవన సమారాధనలు వేదికలన్నారు. అనంతరం యాదవ సంఘం నాయకులు గోకుల్ శివ, నాగన బోయిన రవి తదితరులు మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ, జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డంరాజు, డిసి వైస్ చైర్మన్ శాయన శివయ్య, జనసేన పార్టీ యూత్ అధ్యక్షులు కూనపురెడ్డి ప్రసాద్, డివిజన్ ఇంచార్జ్ కొలపల్లి గణేష్‌లను శాలువాతో సత్కరించి పుష్పగుచ్చాన్ని అందించారు. జనసేన పార్టీ నాయకులు యాదవ సంఘీయులకు కృతజ్ఞతలు తెలిపారు.



## మంటాడ శివాలయంలో హుండి పగలగొట్టి చోరీ

**పమిడిముక్కల మేజర్ న్యూస్:** మండల పరిధిలోని మంటాడ శివాలయంలో దొంగతనం జరిగింది. ఆలయ ప్రాంగణం తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి గుడిలో ఉన్న హుండి పగులకొట్టి నగదును దోచుకున్నారు. మూడు నెలల నుంచి హుండి లెక్కించలేదని ఆలయ పూజారి తెలిపారు. గతంలో ప్రతినెల హుండీ లెక్కించే వారమని, ఈసారి సుమారు మూడు నెలల నుంచి హుండీ లెక్కించలేదని పూజారి తెలిపారు. దీంతో సుమారు లక్షన్నర రూపాయల వరకు అపహరణకు గురై ఉంటుందని పూజారి పేర్కొంటున్నారు. సమాచారం అందుకున్న పగుడి ముక్కలు ఎస్సై డి శ్రీను చెప్పండి తో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. కాగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయమని రెండు నెలల వ్యవధిలో నోటీసులు జారీచేసినా ఆలయ కమిటీ పట్టించుకోవడంలేదని ఈ సందర్భంగా పోలీసులు పేర్కొన్నారు. ఈ ఆలయం ప్రైవేటు వ్యక్తులకు చెందినది అని, దేవాదాయశాఖకు ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. వేలిముద్రల నిపుణులు, డాగ్ స్క్వాడ్ బృందాన్ని పిలిపించి నమూనాలు సేకరించారు. ఈ చోరీపై ఎస్ఐ బి.శ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రాచీన క్షేత్రాన్ని వృద్ధిలోకి తేవటం ఆదర్శం

### ప్రముఖ ప్రవచనకర్త, ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** నరకాసుర సంహార క్షేత్రంగా ఖ్యాతి గడించిన ప్రాచీన క్షేత్రం పృథ్వీశ్వర క్షేత్రాన్ని వృద్ధిలోకి తేవటం ఆదర్శనీయమని ప్రముఖ ప్రవచనకర్త, ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు ప్రశంసించారు. ఆదివారం చల్లపల్లి మండలం నడకుదురులోని ప్రాచీన శైవక్షేత్రం శ్రీ పృథ్వీశ్వర స్వామి దేవస్థానాన్ని చాగంటి కోటేశ్వరరావు దర్శించుకున్నారు. ఆయనకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్వాగతం పలికారు. పృథ్వీశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఆయనకు ఆలయ అభివృద్ధికర్త మండవ రవీంద్ర– రమణ కుమారి దంపతులు, డాక్టర్ యార్లగడ్డ మధు కిరణ్– డాక్టర్ మండవ సింధూర దంపతులు, దేవస్థానం ఈఓ యార్లగడ్డ శ్రీనివాసరావు (వాసు) సత్కరించారు. ఈ పురాతన దేవస్థానానికి గాలి గోపురం, ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తి పీఠాల సమేత నూతన ప్రాకారాన్ని యాగశాలలను నిర్మించిన దేవస్థాన సమగ్ర అభివృద్ధి కర్తలు మండవ రవీంద్ర – రమణకుమారి దంపతులను చాగంటి కోటేశ్వరరావు అభినందించారు. మంచి పని చేశారంటూ సత్కరించారు. ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వరరావు దేవస్థానం చెంతనే ఉన్న పాటలీ వనం దర్శించుకుని, లక్ష్మీనారాయణ స్వామికి పూజలు చేశారు. దేవస్థానం ఆవరణలో మొక్క నాటారు. అనంతరం దేవస్థానం వద్ద ఉన్న కార్తీక వనంలో కార్తీక వన సమారాధనలో పాల్గొని తన శిష్యగణంతో కలిసి వన భోజనం చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, విశ్రాంత ఆర్టీఏ నాదెళ్ల శివరామకృష్ణ, మాజీ సర్పంచ్ పరుచూరి సురేష్, మల్లుపెద్ది త్రివిక్రమరావు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నారాయణలో ఘనంగా స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ ఎస్.ఎల్.సి





## విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, ఆత్మ విశ్వాసం, కమ్యూనికేషన్ స్కిల్స్ బాల్య దశ నుండే పెంపొందించాలి

### కార్యక్రమంలో వక్తలు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** స్థానిక మచిలీపట్నం శిడింబి అగ్రహారంలో గల నారాయణ స్కూల్‌లో నిన్న, నేడు నిర్వహించిన స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ ఎస్.ఎల్.సిలో భాగంగా విద్యార్థినీ విద్యార్థుల నేతృత్వంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థినీ విద్యార్థులు తమ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తమ అభ్యాసం, సాధించిన విజయాలు,, భవిష్యత్తు లక్ష్యాల గురించి స్వయంగా వివరిచారు. ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులకు సహాయకులుగా వ్యవహరించారు. కానీ, ప్రధానంగా విద్యార్థినీ విద్యార్థులు సమావేశాన్ని నడిపించారు. స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్(ఎస్. ఎల్.సి)కార్యక్రమాన్ని ఉద్దేశించి నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ సి.హెచ్ సాయి సుధీర్ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులులో బాల్య దశ నుండే నాయకత్వ లక్షణాలు పెంపొందించే విధంగా చేయాలనే ప్రధాన ఉద్దేశంతో నిన్న, నేడు విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లి తండ్రులు,యాజమాన్యంలో వివిధ హోదాలలో పని చేస్తున్న అందరినీ సమన్వయపరుచుకుని ఈ స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స నిర్వహించటం జరిగిందన్నారు. స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ ఎస్ఎల్‌సికి ముఖ్య అతిథిగా హాజరైన ఈ చామ్స్ కో ఆర్డినేటర్ ఈ. లియోని మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు తమ అభ్యాసానికి బాధ్యత వహించేలా చేయడం, తమ పురోగతిని ప్రతిబింబించేలా చేయడం, భవిష్యత్తు కోసం ప్రణాళికలు వేసుకునేలా చేయడం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ ఎస్.ఎల్.సి ముఖ్య లక్ష్యం అని, ఆ లక్ష్యం వంద శాతం మచిలీపట్నం విద్యార్థులు చేరుకోగాలిగారన్నారు. గౌరవ అతిథిగా హాజరైన క్లస్టర్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవడానికి, కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి ఇది ఒక మంచి అవకాశం అన్నారు. విద్యార్థులు తమ అభ్యాస ప్రయాణాన్ని తల్లిదండ్రులతో పంచుకోవడానికి ఈ స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ ఎస్.ఎల్.సి ఒక మంచి వేదికను అన్నారు. విద్యార్థిని విద్యార్థులు తమ పనిని, నేర్చుకున్న విషయాలను చక్కగా ప్రదర్శించారని తెలుపుతూ సంబంధిత విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల కేరింతలు తల్లి తండ్రులు, ఉపాధ్యాయుల ఆనందోత్సవంల నడుమ శని, ఆదివారంలలో ఉదయం నుండి సాయంత్రం వరకు జరిగిన ఈ కార్యక్రమంలో ఈ చామ్స్ వైస్ ప్రిన్సిపాల్ ఎం.దివ్య వాణి, ఏవో వి రవి కుమార్, ఎన్.జెస్సికా,శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మహిళ క్రికెటర్లు గెలవాలని ప్రత్యేక పూజలు



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** భారతదేశ మహిళ క్రికెటర్లు ఫైనల్ మ్యాచ్లో విజయం సాధించాలని కోరుతూ కూటమి నాయకులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపించారు. ఆదివారం వంతెన సెంటర్లో కొలువై ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానంలో కూటమి నేతలుప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసి చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ఇప్పటివరకు జెంట్స్ క్రికెటర్స్‌ను మాత్రమే చూశారు. ఇప్పుడు ప్రపంచ క్రికెట్ కప్పు ఫైనల్లో ఈరోజు భారత్ దక్షిణాఫ్రికాపై ఫైనల్ ఆడబోతున్న సందర్భంగా ఈ ఫైనల్ మ్యాచ్ భారత్ గెలవాలని కోరుకుంటున్నామని చేశామన్నారు. సెమీఫైనల్లో భారత్ మహిళా క్రికెటర్ జమీమా రో డ్రీక్స్127 పరుగులు చేసి భారత్ కు ఘన విజయాన్ని అందించారు. ఈరోజు జరుగుతున్న ఫైనల్ మ్యాచ్ లో కూడా ఇంకా ఎక్కువ పరుగులు సాధించాలని, బ్యాటింగ్ లోను, బౌలింగ్ లోను, ఫీల్డింగ్ లోను, భారత్ మహిళా క్రికెటర్లు రాణించాలని, భారత్ లో ప్రతి ఒక్క పౌరుడు మీ విజయాన్ని కోరుకుంటున్నారని అన్నారు.

ఈ కార్యక్రమంలో మోర్ల రాంబాబు, బండే రాఘవ, వేములమాడ రజిత, వేములవాడ నాని, రాయపూడి రాయపూడి వేణుగోపాలరావు, మండలి రామ్మోహన్రావు, కూనప రెడ్డి చంద్రశేఖర్, బండే కనకదుర్గ, విశ్వనాథపల్లి పాప, సీతామహాలక్ష్మి, వాసిరెడ్డి రాకేష్, బాలమ్మ, ఎలవర్తి చిన్న, మెగావత్తు గోపి, తాడేపల్లి రంగనాథ్, పులిగడ్డ బాల శ్రీను, బచ్చు శ్రీహరి, సిద్ధ బత్తుని హరిబాబు, గూడవల్లి తిలక్, మోర్ల నాగేశ్వరరావు, గుగ్గిలం శ్యాం కుమార్, ముళ్ళపూడి శ్రీనివాసరావు, బడే సుబ్బారావు, కొండవీటి పాండురంగారావు, బొల్లా సుబ్రహ్మణ్యం, బోల్ల సత్యనారాయణ, పెనుముచ్చ స్కైలాబ్, సాయి, రాంబాబు, బొల్లా రవి,తదితరులు పాల్గొన్నారు..

# స్వర్గీయ మండలి విగ్రహానికి వెలువోలు నేతల నివాళి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, దివిసీమ గాంధీ స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం స్థానిక వంతెన సెంటరులో స్వర్గీయ మండలి విగ్రహానికి చల్లపల్లి మండలం వెలువోలు గ్రామ సర్పంచ్ వేములమడ రజిత, టీడీపీ గ్రామ అధ్యక్షుడు మురాల నాగేశ్వరరావు, టీడీపీ యువనాయకుడు వాసిరెడ్డి రాకేష్, గ్రామ ప్రముఖులు వేములమడ నానీ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి కమిటీ, గాంధీ క్షేత్రం, మండలి అభిమానుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ అవనిగడ్డ, చల్లపల్లి మండలాల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, మోర్ల రాంబాబు, జనసేన ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, ఏఎంసి వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, టీడీపీ టౌన్ అధ్యక్షులు అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు లింగం బాబూరావు, పీఏసీఎస్ చైర్మన్లు యలవర్తి రాజ నాగ మునేశ్వరరావు, యర్రంశెట్టి సుబ్బారావు, గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, దివి సీమ లలిత కళా సమితి కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్, గాంధేయవాది గరికపాటి సీతారామయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మానేపల్లి కోటయ్య, ప్రముఖ న్యాయవాది బొప్పన వెంకట సుబ్రహ్మణ్యేశ్వర రావు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, టీసీ అధ్యక్షులు రేపల్లె రవీంద్ర, మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ, కూటమి నాయకులు బండే రాఘవ, ఘంటసాల రాజమోహనరావు (కన్నయ్య), బచ్చు శ్రీహరి, అన్నపరెడ్డి రామదాసు, దేగల రాఘవ, బాలు శ్రీనివాస్, చెన్ను బాబూరావు, మండలి రామ్మోహనరావు, విశ్వనాధపల్లి పాప, గుగ్గిలం శ్యాంకుమార్, బడే సుబ్బారావు, వాహేదుల్లా, గుడివాక నరహరి, బచ్చు ఆదినారాయణ, కొండవీటి పాండురంగారావు, వెలువోలు నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు బొల్లా సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ, రవి, అంకారావు, శోభనాద్రి, స్కైలాబ్, రాఘవులు, గోవిందు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు ఆర్థిక సాయం



పెదపారుపూడి మేజర్ న్యూస్ : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పి-4 పథకం పేదరిక నిర్మూలనకు ఎంతగానో దోహదపడుతుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మండల కేంద్రమైన పెదపారుపూడి గ్రామంలో మొంథా తుఫాన్ కారణంగా అనేక ఇబ్బందులు పడ్డ అంగిరేకుల రామారావు, అంగిరేకుల రామస్వామి కుటుంబాలకు పి-4 పథకం ద్వారా టీడీపీ నాయకుడు చప్పిడి కిషోర్, ఒక్కొక్క కుటుంబానికి 10 వేల రూపాయల వంతున ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా చేతుల మీదుగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చప్పిడి సమీర, తాసిల్దార్ బి.శ్రీనునాయక్, డిప్యూటీ ఎంపీడీవో వంగ శ్రీనివాస్ వంశీ, ఆర్ ఐ శ్రీనివాస్, కార్యదర్శి ఈశ్వరి కుమారి దగాని లెనిన్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వాముల కావడి యాత్ర



**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** పవిత్ర కార్తీక మాసంలో అయ్యప్ప స్వామి మాల ధారణ చేసిన భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో కావిడి యాత్ర నిర్వహించారు. ఆదివారం మండల పరిధిలోని వేకనూరు గ్రామం నుంచి మోపిదేవి పుణ్యక్షేత్రానికి కాలినడకన అయ్యప్ప మాలధారుల కావడి యాత్ర కొనసాగింది. స్థానిక వంతెన సెంటర్లో కొలువైయున్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద ఎమ్మెల్యే మండలి తనయుడు,యువ నాయకుడు మండలి వెంకట్రామ్ అయ్యప్పలకు స్వాగతం పలికి, వారికి తాగునీరు పండ్లు అందజేశారు. వేకనూరు గురు స్వామి తుంగల సురేష్ స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కావడి యాత్రలో తుంగలసునీల్, కుటుంబరావు, గుడివాడ అంకారావు, గరిక గోవిందు అప్పికట్ల పవన్ కుమార్ తదితర స్వాములు శరణు ఘోష చెప్పుకుంటూ యాత్ర కొనసాగించారు.

## శ్రీసోమేశ్వరస్వామికి లక్ష బిళ్వార్చన



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** కార్తీకమాసం సందర్భంగా లక్ష్మీపురంలోని శ్రీదుర్గా పార్వతీ సమేత సోమేశ్వర స్వామి వారి ఆలయంలో లక్ష బిళ్వార్చన కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. ఉదయం మహా న్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించి మధ్యాహ్నం నుంచీ సాయంత్రం వరకు లక్ష బిల్వార్చన జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు భమిడిపాటి బాలసుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో అర్చకులు, పురోహితులు కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

## శ్రీ సత్యదేవుని దేవస్థాన శిఖర ప్రతిష్ట విజయవంతం



**గుడ్లవల్లేరు నవంబరు 02 మేజర్ న్యూస్:** గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి, శ్రీ గంగానమ్మ దేవస్థానాల జీర్ణోద్ధరణ పనులను పూర్తి చేసి శిఖర ప్రతిష్టను విజయవంతంగా నిర్వహించారని పలువురు ఆదివారం ఆలయ అభివద్ధి కమిటీ నిర్వాహకుల్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా దేవస్థాన అభివద్ధికి కషి చేసిన ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్యచౌదరి, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, యలమంచిలి రామ కొటేశ్వరరావును దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు.

# జోగి రమేష్ దొంగ ప్రమాణం చేశాడు పాపం పండింది

**దొండపాటి విజయ్ కుమార్**



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మొంథా తుఫాన్ కారణంగా ఏ ఒక్క ప్రాణం నష్టపోలేదని, రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే డైవర్షన్ పాలిటిక్స్ అనే ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. కాశీబుగ్గ పట్టణంలో ఉన్న దేవాలయానికి, ప్రభుత్వానికి ఏం సంబంధం లేకపోయినా జరిగిన సంఘటన దుర్మార్గమని తెలుసుకుని మృతుల కుటుంబాలను నారా లోకేష్ కూటమి నాయకులు పరామర్శించి 15 లక్షల ఆర్థిక సాయం చేసి వారికి ధైర్యం చెప్తే డైవర్షన్ పాలిటిక్స్ అని శివ రాజకీయాలు చేసే నీచ సంస్కృతి వైసీపీకే చెల్లుతుందన్నారు.

**తప్పులు చేయటం వైసీపీ డి.యన్.ఎ. లోనే వుంది**

జోగి రమేష్ పై తీవ్ర స్థాయిలో మండిపడ్డ దొండపాటి విజయ్ కుమార్ఈ అరెస్ట్ తో ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదుసీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ లపై నిందలు మోపడం దుర్మార్గంజనార్ధన్ రావు ఇచ్చిన సమాచారం తో జోగి రమేష్ అరెస్టు జోగి రమేష్ విచారణ లో వై.ఎస్.జగన్ పేరు చెప్పటం ఖాయం. ఈ నకిలీ మద్యం కుంభకోణంలో జగన్ కి కూడా సంబంధం వుంది. వైసీపీ నాయకులు తప్పులు చేయటం, దోచుకోవటం, దాచుకోవటం బాగా అలవాటు..డైవర్షన్ పాలిటిక్స్‌కి పెట్టింది పేరు వైసీపీ...తప్పులు చేయటమనేది వాళ్ల డి.ఎన్.ఎలోనే వుంది. అందుకే నకిలి మద్యంలో కేసులో సంబంధం వున్న జోగి రమేష్ అమ్మవారి ముందు దొంగ ప్రమాణం చేశాడు...అందుకే పాపం పండి అరెస్టు కావటం జరిగిందని ఏపీ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ కార్పొరేషన్ డైరెక్టర్ దొండపాటి విజయ్ కుమార్ ఆరోపించారు. నకిలీ మద్యం కేసులో జోగి రమేష్ అరెస్ట్ పై ఆంధ్రప్రదేశ్ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ డైరెక్టర్ దొండపాటి విజయ్ కుమార్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నకిలీ మద్యం కేసులో అరెస్ట్ అయిన జనార్ధన్ రావు ఇచ్చిన స్టేట్ మెంట్ ఆధారంగానే జోగి రమేష్ ను సిట్ అధికారులు, పోలీసులు అరెస్ట్ చేయటం జరిగిందని తెలిపారు.ఈ అరెస్ట్ కు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎలాంటి సంబంధం లేదన్నారు.

తన అరెస్ట్ గురించి ముందే గ్రహించిన జోగి రమేష్ తన స్థాయి పెంచుకోవటానికి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ నిందలు మోపడం జరిగిందన్నారు. జోగి రమేష్ ఒక బచ్చా అంటూ.... రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావాలనే సంకల్పంతో కృషి చేస్తున్న సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేష్ కు జోగి రమేష్ గురించి ఆలోచించేంత తీరక లేదన్నారు.జనార్ధన్ రావు నకిలీ మద్యంలో కేసు లో జోగి రమేష్ కి సంబంధం వుందని వాంగ్మూలం ఇచ్చిన తర్వాతే జోగి రమేష్ పై సిట్, పోలీసులు అధికారులు దృష్టి పెట్టడం జరిగిందన్నారు. ఇప్పుడు అరెస్ట్ అయిన జోగి రమేష్ విచారణలో నకిలీ మద్యం వెనక వున్న అసలు కీలక సూత్రధారి వై.ఎస్.జగన్ పేరు చెప్పటం ఖాయమన్నారు. దొంగతనం చేసి ప్రతి దొంగ ముందు తాను నిర్ధోషినే అంటాడు...పోలీసుల విచారణలో అన్ని నిజాలు బయటకు వస్తాయని, అలాగే జనార్ధన్ రావు పోలీసులు విచారణలో జోగి రమేష్ పేరు బయటికి వచ్చిందన్నారుతప్పు చేసిన దొరికిపోయిన జోగి రమేష్ తన అరెస్ట్ సమయంలో కులం గుర్తు రావటం సిగ్గు చేటు అన్నారు. బీసీ అని చెప్పుకుంటున్న జోగి రమేష్ తనకు వున్న వందల కోట్లు రూపాయలు బీసీలకు పంచిపెట్టాలన్నారు. తన అరెస్ట్ ను డైవర్షన్ చేయటానికి జోగి రమేష్ రకరకాలు ప్రయత్నాలు చేశాడన్నారు. ఈ రాష్ట్రంలో బీసీలకు అధికారం హక్కును తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు కల్పిస్తే..ఆ తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు కొనసాగించారన్నారు. వాళ్ల వల్లే వై.ఎస్ జగన్ బీసీలకు వైసీపీలో అరకొర పదవులు ఇచ్చాడు. రాష్ట్రంలో బీసీలకు వెలుగు నిచ్చింది తెలుగుదేశం పార్టీ అంటూ ఉద్ఘాటించారు. తను బీసీ కాబట్టే అరెస్ట్ చేస్తున్నారని జోగి రమేష్ మాట్లాడితే నమ్మటానికి ప్రజలెవ్వరూ సిద్దంగా లేరన్నారు. బీసీ కార్డ్ మీద లబ్ది పొందిన జోగి రమేష్ ఒక బీసీకి సాయం చేసిన దాఖలాలు లేవన్నారు.

జగన్ మోహన్ రెడ్డి పాలనలో ఎంతో మంది బీసీల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ఆ సమయంలో జోగి రమేష్ కు బీసీ లు ఎందుకు గుర్తు రాలేదంటూ ప్రశ్నించారు. పోలీసులు అరెస్ట్ చేసే సమయంలో కులం గుర్తు రావటం చాలా దురదృష్టకరమన్నారు. వై.ఎస్.జగన్ తన హయంలో నకిలీ మద్యం తయారు చేయించి అమ్మటం ఒక అలవాటుగా మారింది. అందుకే డిజటల్ పేమెంట్స్ వైన్స్ షాపుల దగ్గర తీసివేశారు. ఈ మద్యం కుంభకోణం కేసులో కూడా తాడేపల్లి ప్యాలెస్ కు డబ్బు చేరినట్లు చెప్పారు. నకిలీ మద్యం కేసులో జోగి రమేష్ వెనుక జగన్ ఉన్నాడన్నారు. అందుకే ఈ వ్యవహారం గత ప్రభుత్వం లో బయటకు పొక్కలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఈ నకిలీ మద్యం వెలుగులోకి తీసుకురావటం జరిగిందన్నారు. టీడీపీ తరుపున జయచంద్రారెడ్డి పోటీ చేసిన సరే అరెస్ట్ చేయటం జరిగిందని, తక్షణం సీఎం చంద్రబాబు పార్టీ నుంచి సస్పెండ్ చేయటం జరిగిందన్నారు. వైసీపీ నాయకులు ఒక పథకం ప్రకారమే జయచంద్రారెడ్డి ను టీడీపీలో పంపించటం జరిగిందన్నారు. నకిలీ మద్యం కేసుకి సంబంధించి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ వచ్చి ప్రమాణాలు చేయాలని జోగి రమేష్ అడగటం తను తప్పు చేయలేదని అమ్మవారి గుడిలో ప్రమాణం చేయటంతో పాపం పండిందన్నారు. ఈ కేసు కి వాళ్లకి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. జగన్ మోహన్ రెడ్డి బాబాయ్ వివేకా నందరెడ్డిని హత్య చేయించాడు...42 వేల కోట్లు దోచుకున్నాడు..హత్య చేయించలేదని, డబ్బులు దోచుకోలేదని ప్రమాణం చేస్తే తప్పు చేయనట్లేనా అంటూ ప్రశ్నించారు. వైసీపీలో జగన్ పెద్ద దొంగ అయితే జోగి రమేష్ లాంటి నాయకులు చిన్న దొంగలు అంటూ చురకలు అంటించారు. దమ్ముంటే అరెస్ట్ చేయాలన్న జోగి రమేష్ పోలీసులు వచ్చే సరికి పిల్లిలాగా బాత్ రూమ్ లోకి పారిపోయి దాగున్నాడని ఎద్దేవా చేశారు. తప్పు చేశాధు కాబట్టే పోలీసుల ఎదుట నిలబడి సమాధానం చెప్పలేకపోతున్నాడన్నారు.వైసీపీ పాలనలో తనతో పాటు టీడీపీ నాయకుల్ని అరెస్ట్ చేయటానికి ఎన్నో సార్లు పోలీసులు వచ్చారు. తాము తప్పు చేయలేదు కాబట్టి పోలీసులను చూసి పారిపోలేదని, ధైర్యంగా నిలబడి పోరాడమన్నారు.

జోగి రమేష్‌కు నిజాయితీ లేదు కాబట్టే పోలీసుల్ని చూసి పారిపోవటానికి ప్రయత్నించాడన్నారు. ఏ ప్రభుత్వంలోనైనా ఎమ్మెల్యేలు అవినీతి చేస్తే జైలు వెళ్లాల్సిందేనన్నారు. రాష్ట్రాన్ని వైసీపీ నాయకులు నాశనం చేశారు. ఇందులో ప్రధాన పాత్ర జగన్ మోహన్ రెడ్డి పోషిస్తే ఆ తర్వాత పాత్ర జోగి రమేష్ పోషించాడన్నారు.వైసీపీ నాయకులు నకిలీ మద్యం సరాఫరా చేసి రాష్ట్రంలోని ప్రజలకు స్లో పాయిజన్ ఇచ్చారని మండిపడ్డారు. ప్రజల ప్రాణాలు తీసి డబ్బులు దోచుకోవటం జరిగిందన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళతామన్నారు. వైసీపీ నాయకులు ఇంకా ఓవర్ యాక్షన్ చేస్తే నకిలీ మద్యం తాగి చనిపోయిన వారి కుటుంబ సభ్యులతో తాడేపల్లి ప్యాలెస్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. జోగి రమేష్ మంచోడని మరో దొంగ జగన్ సర్టిఫికేట్ ఇవ్వడం విశేషమన్నారు. జనార్ధన్ అంత స్పష్టంగా చెప్పినా జగన్ చిలక పలుకులు పలకటం ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. మద్యం షాపుల్లో ఆన్ లైన్ లావాదేవీలు లేకుండా చేసి జగన్ కోట్ల రూపాయాలు దోచుకున్నాడన్నారు. వైసీపీ నాయకులు వై.ఎస్ జగన్ ఎన్ని డ్రామాలు ఆడినా, కల్తీ మద్యం కేసులో పాత్రధారులు, సూత్రధారులు అందరూ జైలుకు వెళ్లడం ఖాయమన్నారు.

# చట్ట ప్రకారమే జోగి రమేష్ అరెస్ట్...

**ఇందులో ఎటువంటి కక్షలు లేవు...**

**డైవర్షన్ పాలిటిక్స్ కానే కాదు.**

**సాక్ష్యాత్తు అద్దేపల్లి స్వయంగా**

**జోగి కుట్రను బహిర్గతం చేశాడు**

**సమగ్ర విచారణ అనంతరమే జోగిపై చర్యలు**

**జోగి రమేష్ చిల్లర వ్యక్తి...**

**అతనివి చిల్లర రాజకీయాలు**

**ప్రజలంతా వాస్తవాలు గ్రహించాలి.**

**మైలవరం నియోజకవర్గ టీడీపీ నాయకులు**




**జి.కొండూరు మేజర్ న్యూస్ :** నకిలీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేష్ ను సిట్ అధికారులు చట్ట ప్రకారం అరెస్ట్ చేశారని, ఇందులో ఎటువంటి కక్షలు, కార్పణ్యాలు లేవని, డైవర్షన్ పాలిటిక్స్ కానే కాదని తెలుగుదేశం పార్టీ నాయకులు స్పష్టం చేశారు. మైలవరంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదివారం మీడియాతో మాట్లాడుతూ నకిలీమద్యం తయారీ వెలుగులోకి వచ్చిన నాటి నుంచి కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు.ఇందులో కూటమి ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా సమగ్ర దర్యాప్తు నివేదికల ఆధారంగా చర్యలు చేపట్టిందన్నారు. అలాగే నకిలిమద్యం ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు స్వయంగా జోగి రమేష్ పాత్ర గురించి చెప్పిన వీడియో బయటకు రాక ముందు నుంచే గుమ్మడికాయలు దొంగ ఎవడు అంటే భుజాలు తడుముకున్నట్లు జోగి రమేష్ ప్రవర్తన ఉందన్నారు. అద్దేపల్లితో సంబంధాలు, లావాదేవీలు ఉండబట్టే జోగి రమేష్ తనను ఈ కేసులో అరెస్ట్ చేస్తారని ఊహించి ముందు నుంచే ఇదే విషయాన్ని పలు సార్లు మీడియా ముందు చెప్పాడని అన్నారు.అప్పటివరకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు పై బురద జల్లుతూ నకిలీమకిలిని అంటించాలని చూసిన జోగికి, అద్దేపల్లి వీడియో బయటకు రావడంతో పరాభవం ఎదురైందన్నారు. అద్దేపల్లి వీడియో బయటికి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదుపై నకిలిమద్యం ఆరోపణలు ఆపేసి, అప్పటినుంచి చంద్రబాబు, లోకేష్‌పై సవాళ్లు చేస్తూ, దేవుని ఎదుట ప్రమాణాలు అంటూ జోగి రమేష్ మరో కొత్త పల్లవి అందుకున్నాడన్నారు. జోగి రమేష్ చేయాల్సిందంతా చేసి తప్పును ప్రభుత్వంపై రుద్దటానికి వేసిన ప్లాన్ బెడిసికొట్టిందన్నారు. ఈ క్రమంలో బీసీ కార్డును వాడి, రంగా అభిమాని అంటూ రకరకాలుగా ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడినట్లు పేర్కొన్నారు. దీనిపై నిశితంగా పరిశీలించి దర్యాప్తు చేసిన సిట్ అధికారులు అద్దేపల్లితో పాటు నిందితులను కస్టడీలోకి తీసుకుని వారం రోజుల పాటు విచారించిన తర్వాత తగు ఆధారాలతో జోగిని అరెస్టు చేశారని అన్నారు. అసలు వైకాపా హయాంలో జోగి మంత్రిగా ఉన్ననాటి నుంచే నకిలిమద్యం తయారీ చేసినట్లు అద్దేపల్లి విచారణలో పేర్కొన్నాడని అన్నారు. అతను ఆఫ్రికా వెళ్ళే ముందు కూడా జోగిని కలిసి వెళ్లాడని పేర్కొన్నారు.ఇన్ని తప్పులు చేసినా జోగి రమేష్ బుకాయిస్తూ తప్పును కూటమి ప్రభుత్వంపై నెట్టి, రాజకీయంగా తనకు అనుకూలంగా మార్చుకోవడానికి యత్నించాడని అన్నారు. ఇందుకోసం తన కుటుంబాన్ని కూడా రోడ్డుకు ఈడ్చాడన్నారు. జోగి రమేష్ అరెస్ట్ ఉద్దేశ్యం పూర్వకంగా జరగలేదని, నకిలీమద్యం కేసులో ప్రధాన సూత్రధారి జోగి రమేష్ కాబట్టే అరెస్ట్ జరిగిందన్నారు. ఇది అవినీతి వైసీపీ ప్రభుత్వం కాదని అన్నారు. కూటమి ప్రభుత్వంలో అవినీతికి తావు లేదన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ మైలవరం నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపించడానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గురించి కూడా ఎన్నో తప్పుడు ఆరోపణలు జోగి రమేష్ చేశాడన్నారు. జోగి రమేష్ ఎంత చించుకున్నా నియోజకవర్గ బడుగు బలహీన వర్గాల నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిమ్, మైనారిటీ నాయకులు అందరూ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు వెంటే నిలిచారని అన్నారు. పేదల రక్తాన్ని జలగలా పీల్చే నక్కజిత్తుల జోగి రమేష్ ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొన్న నాటి నుంచి గౌడ కులాన్ని, రంగా అభిమానులను సైతం కూడా రెచ్చగొట్టే విధంగా మాట్లాడినట్లు పేర్కొన్నారు.జోగి రమేష్ చిల్లర వ్యక్తి... అతనివి చిల్లర రాజకీయాలు అని అన్నారు. ఇతను సంస్కార హీనుడు అన్నారు. వైసీపీ ఆరోపిస్తున్న విధంగా డైవర్షన్ పాలిటిక్స్ ఇందులో ఏమీ లేదన్నారు. ప్రజలంతా వాస్తవాలు గ్రహించాలని కోరారు.మంత్రిగా ఎన్నో కుట్రలు, కుతంత్రాలు చేసిన జోగి రమేష్ అరెస్టు కుట్రలు చేసే రాజకీయ నాయకులకు గుణపాఠం కావాలన్నారు.

# అవనిగడ్డలో లక్ష్మీనారాయణ స్వామివారి కోటి దీపోత్సవం

## భక్తి జ్వాలల్లో మునిగిన ద్వాదశి పర్వదినం - స్వామివారి శాంతి కళ్యాణంతో ఆధ్యాత్మిక వాతావరణం









**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** గాలిగోపురముగా ప్రసిద్ధ చెందిన శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారి ఆలయంలో కార్తీక మాస ద్వాదశి సందర్భంగా ఘనంగా కోటి దీపోత్సవం స్వామి వారి శాంతి కళ్యాణంఅత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం కార్తీక మాసం ద్వాదశి పర్వతనాన్ని పురస్కరించుకొని ఆలయ ధర్మకర్తలు పోతరాజు భాస్కర్ రావు దంపతుల పర్యవేక్షణలో కోటి దీపోత్సవం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సతీమణి విజయలక్ష్మి కుమారుడు వెంకట్రామ్ దంపతులు పాల్గొని భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలను వీక్షించారు.

**కోటి దీపాల కాంతి వెలుగుల్లో ఆలయ ప్రాంగణం**

అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు వెలిగించిన దీపాలతో ఆలయ ప్రాంగణం నిండా వేలాది దీపాలతో ప్రకాశవంతమైంది. ప్రధాన ద్వారం నుండి గర్భగృహం వరకు భక్తులు భక్తిపూర్వకంగా దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం కోటి దీపోత్సవం ప్రారంభానికి ముందు వేదపండితులు వేదఘోషల మధ్య దీపప్రజ్వలన కార్యక్రమం నిర్వహించారు. వేకువజాము నుండి స్వామివారికి అభిషేకం, అర్చన, విశేష అలంకరణ, తులసి దళార్చన, సహస్రనామ పఠనం నిర్వహించారు. ద్వాదశి పర్వదినం సందర్భంగా భక్తులు ఉపవాసం పాటించి, పారాణం చేయడం ద్వారా శ్రీహరి కృప పొందాలని వేదపండితులు సూచించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారి శాంతి కళ్యాణం అత్యంత ఆధ్యాత్మిక వైభవంగా సాగింది. మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కళ్యాణ మహోత్సవం పూర్తి చేయబడింది. భక్తులు "గోవిందా... గోవిందా..." నినాదాలతో ఆలయాన్ని మార్మోగించారు.ద"ప్రతి సంవత్సరం కార్తీక ద్వాదశినాడు ఇలాగే కోటి దీపోత్సవం జరపడం మా అదృష్టం" అని స్థానిక భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. భక్తులకు ప్రసాదంగా అన్నసమారాధన, తులసి దళాల పంపిణీ జరిగింది. ఆలయ నిర్వాహకులు పోతరాజు వంశీకులు భక్తులకు కావలసిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్తీక మాస ద్వాదశి పర్వదినం స్వామివారి కృపను పొందడానికి అత్యంత శుభదాయకమైన రోజు. దీపారాధన, పూజ, దానం చేసిన వారికి అనేక రెట్లు పుణ్యఫలం లభిస్తుంది" అని అన్నారు.

# పడవల కాల్వలో వ్యర్థాలతో పెరుగుతున్న దోమలు





**గుడ్లవల్లేరు, మేజర్ న్యూస్:** గుడ్లవల్లేరులోని పోల్‌రాజ్ పడవల కాల్వలో నీటి ప్రవాహం లేకపోవటంతో ఆ కాల్వ చెత్తా చెదారంతో నిండిపోయింది.

దీనితో ఈగలు, దోమల బెడద స్థానికులతో పాటు పక్కనే ఉన్న తహసీల్దార్, మండల కార్యాలయాలకు ఏర్పడింది.

దీని వలన అంటువ్యాధులు కూడా ప్రబలుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాని ఇరిగేషన్ శాఖ వారు మాత్రం ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఏ మాత్రం పట్టించుకోవటం లేదని ఆరోపిస్తున్నారు.



## గంగానమ్మ, పోతురాజు విగ్రహాలకు క్షీరధివాసం

**గుడ్లవల్లేరు నవంబరు 2 మేజర్ న్యూస్ :** దశాబ్దాల చరిత్ర కలిగిన గుడ్లవల్లేరు శ్రీ గంగానమ్మ దేవస్థానాన్ని జీర్ణోద్ధరణ పనుల అనంతరం ఆలయ పునః ప్రతిష్టను చేస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం శ్రీ గంగానమ్మతల్లి, పోతురాజు స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ శిఖరాలకు జలాధివాసం, క్షీరాధివాసం ఆలయ అభివద్ధి కమిటీ నిర్వాహకులు చేపట్టారు.

## వెంకన్న భక్తులకు భారీ అన్నసమారాధన



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా స్వామివారిని దర్శించుకునేందుకు శనివారం భక్తుల సందడి అధికమైంది. భక్తులు తమ తమ మొక్కుబడులను భక్తి ప్రపత్తులతో తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థికసాయంతో జరిగింది. వేలాది మంది భక్తులు అన్న ప్రసాదాల్ని స్వీకరించారు. తొలుత స్వామివారికి విశేషాభిషాకాలతో పాటు ప్రత్యేక పూజల్ని వేద పండితులు చేపట్టారు. స్వామివారి దర్శనానికి అధికసంఖ్యలో భక్తులు బారులు తీరారు. స్వామివారు సర్వ పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు.

## 5న శ్రీ వెంకటేశ్వరుని సన్నిధిలో కోటి దీపోత్సవం



**గుడ్లవల్లేరు నవంబరు 02 మేజర్ న్యూస్:** కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి సన్నిధిలో బుధవారం రోటి వత్తికా దీపోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆదివారం దేవస్థాన ధర్మకర్తలు బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు విలేకరులకు తెలిపారు. ఈ కల్యాణాన్ని మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులెల్లరూ విచ్చేసి కార్యక్రమంలో పాల్గొని తరించి తీర్థ ప్రసాదాలను స్వీకరించవలసిందిగా కోరారు.

# జోగి రమేష్ అరెస్ట్ చట్టబద్ధమే

## జి.కొండూరు మండల టీడీపీ అధ్యక్షులు వేములకొండ వెంకటేశ్వర



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి కొండూరు మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి మండల పార్టీ అధ్యక్షులు వేములకొండ వెంకటేశ్వ రావు జోగి అరెస్టు చట్టబద్ధమే అమ్మ దుర్గమ్మ సన్నిధిలో చంద్రబాబు నీ లోకేష్ బాబుని మీరు వచ్చి ప్రమాణం చేయండి భార్యాపిల్లలతో నేను చేస్తున్నానంటూ దొంగ ప్రమాణం చేయటమే అమ్మ దుర్గమ్మ కన్నెర్ర చేసి నీ ప్రతిఫలం నువ్వు అనుభవించు చేసిన తప్పుకు ఎవరైనా మూల్యం చెల్లించాల్సిందే అనే విధంగా అమ్మ దీవించడంతో జోగి రమేష్ అనే వ్యక్తి కల్తీ మద్యం కేసులో అరెస్టుకు చట్టబద్ధంగానే అరెస్టయ్యాడని జి కొండూరు మండల టిడిపి పార్టీ అధ్యక్షులు వేములకొండ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి జోగు రమేష్ కులాలను రెచ్చగొడుతున్నారని మైలవరం నియోజకవర్గంలో కులం వివక్షత లేదని మా కులంలో పుట్టిన చీడ పురుగు జోగి రమేష్ అని ఆయన పేర్కొన్నారు ఇటువంటి వారిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## కేరింతలు, హర్షద్వానాలతో..

# దద్దరిల్లిన ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం





**విజయవాడ మేజర్ న్యూస్ :** ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఫ్యాన్ పార్క్ కు నగరవాసులు, క్రికెట్ అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో ఐసిసి వుమెన్ వరల్డ్ కప్ 2025 ఇండియా –సౌతాఫ్రికా ఫైనల్ మ్యాచ్ చూసేందుకు మూడు బిగ్ స్క్రీన్స్ ఏర్పాటు చేశారు. స్టేడియంలో బిగ్ స్క్రీన్ పై మ్యాచ్‌ను వీక్షించేందుకు విచ్చేసిన క్రికెట్ అభిమానులకు గ్యాలరీలు ఏర్పాటు చేశారు. కొంత మంది క్రికెట్ అభిమానులు స్టేడియంలోని స్టాండ్స్ పై నుంచి వీక్షించారు. ఇండియా టీమ్ బ్యాటింగ్ చేసే సమయంలో బౌండరీలు, సిక్సర్లు కొట్టిన ప్రేక్షకులు చప్పట్లు , కేరింతలు కొడుతూ సందడి చేశారు. మహిళ క్రికెట్ ను ప్రోత్సాహించాలనే ఉద్దేశ్యంతో ఏసీఏ ఏర్పాటు చేసిన ఫ్యాన్ పార్క్ అధిక సంఖ్యలో మహిళలు రావటం విశేషం, క్రికెట్ అభిమానులు ఇండియా టీమ్‌కు సపోర్ట్‌గా జాతీయ జెండాలను రెపరెపలాడితూ మద్దతుగా నిలిచారు. మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభమైన...మ్యాచ్ ను చివరి వరకు ఆసక్తిగా తిలకించారు. ఏసీఏ రాష్ట్ర వ్యాప్తంగా విజయవాడలోనే కాకుండా వైజాగ్ లో రెండు కళాశాల్లో, కాకినాడలో ఒక కళాశాలలో ఫ్యాన్ పార్క్ ఏర్పాటు చేసి ఇండియా–సౌతాఫ్రికా మ్యాచ్ చూసేందుకు బిగ్ స్క్రీన్స్ ఏర్పాటు చేయటం జరిగింది.

# విజయవాడలో తొలిసారి ఇళయరాజా సంగీత కచేరీ






**ఇళయరాజా కటౌట్‌కు పాలాభిషేకం**

**ఈనెల 8న ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం వేదికగా సంగీత కచేరీ**

**15 వేల మంది ప్రేక్షకులకు సీటింగ్ సౌకర్యం**

**విజయవాడ నవంబర్ 2 మేజర్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్‌లో మొదటిసారిగా ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా మ్యూజికల్ కన్సర్ట్ విజయవాడలో జరగనుంది. ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం వేదికగా ఈనెల 8వ తేదీన సాయంత్రం ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ట్రెండ్ సెట్టర్ ఈవెంట్స్ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కచేరీకి రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తోంది. “రాజధాని అమరావతికి సమీపంలో ఈ కార్యక్రమం నిర్వహించడం సంతోషకరం. నగర ఖ్యాతిని మరింత పెంచేందుకు ఇది దోహదపడుతుంది” అని సంస్థ ఆర్గనైజర్ పద్మనాభుని సుధాకర్ తెలిపారు.

ఇళయరాజాతో కలిసి ఎస్పీ చరణ్, హరిచరణ్, మధుబాలకృష్ణన్, జితేంద్ రాజ్‌తో పాటు మరో 10 మంది ప్రముఖ గాయకులు పాల్గొంటారు. 70 మంది సంగీతకారుల బృందం సహకారంతో సంగీత ప్రియులకు ఆహ్లాదకరమైన అనుభవం అందనుంది. 15 వేల మంది ప్రేక్షకులకు సీటింగ్ సౌకర్యం కల్పించారు. ఆదివారం స్టేడియం సమీపంలో 50 అడుగుల ఇళయరాజా స్వరాలు మొదటి స్వరం వినగానే పాత జ్ఞాపకాలు కళ్ల ముందు కదలాడతాయి. ప్రతి పాటా ఒక కథ చెబుతుంది, ప్రతి స్వరం ఒక భావాన్ని మోస్తుంది. 15 వేల మంది ప్రేక్షకులు ఒకే గొంతుతో పాడుకునే దివ్య సదృశ్యాన్నీ చూడనున్నామన్నారు. ఇదీ ఒక రాత్రి సంగీతం కాదనీ ఒక యాత్రలా ఉంటుందన్నారు. ఇళయరాజా కటౌట్‌ను ఏర్పాటు చేసి, కళాకారులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగర్స్ సాయి సిద్ధార్థ, కళ్యాణి, ఈశ్వర్, కిషోర్, సత్య, పుణ్యశీల తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఫైనల్ క్రికెట్ మ్యాచ్ కోసం డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేసిన టీడీపీ నాయకులు





**పామర్రు మేజర్ న్యూస్ :** పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఆదేశాల మేరకు పామర్రు టౌన్ ఎన్టీఆర్ సర్కిల్ వద్ద భారత - దక్షిణాఫ్రికా మహిళల వరల్డ్ కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ వీక్షించేందుకు ఆ పార్టీ నాయకులు డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. భారత్ జట్టు విజయాన్ని కాంక్షిస్తూ డిజిటల్ స్క్రీనింగ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేశారు. అయితే జోరున వర్షం కురుస్తున్నా క్రికెట్ అభిమానులు మాత్రం వర్షంలోనే క్రికెట్ ఆటను ఆస్వాదిస్తూ తన్మయత్వం చెందుతున్నారు. క్రికెట్ అభిమానులతో కలిసి ఎమ్మెల్యే కుమార్ రాజా సోదరుడు వర్ల చైతన్య, జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జ్ తాడిశెట్టి నరేష్, తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు డిజిటల్ స్క్రీన్ పై క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించారు.

## మీ నేత్రాలు అమూల్యమైనవి, వాటిని జాగ్రత్తగా చూసుకోవాలి



**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** మీ నేత్రాలు అమూల్యమైనవి, వాటిని జాగ్రత్తగా చూసుకోవాలని ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ భానుమూర్తి సూచించారు. సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని, అతిగా సెల్ వినియోగించడం అనర్ధదాయకమని అన్నారు. నగరంలోని వారికి, పరిసర ప్రాంత ప్రజలకు ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని సన్ స్టార్ లో, మానవతా స్వచ్ఛంద సంస్థ వారు ఏర్పాటు చేశారు ఆరోగ్యాబివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, స్థానిక సన్ స్టార్ స్కూల్ ప్రాంగణంలో ఆదివారం నాడు హ్యుమానిటీ ఫౌండేషన్ మానవత స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు.కంటిచూపు సమస్యతో బాధపడుతున్న 200 మందికి పైగా రోగులను గుర్తించి, వారికి ఉచిత వైద్య పరీక్షలు అందించి,ఉచితంగా మందులు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు ఇవ్వడం జరిగింది. ఆపరేషన్ అవసరమైన వారికి కంటి శస్త్ర చికిత్స ఆపరేషన్లు ఉచితంగా చేస్తామని ప్రముఖ డాక్టర్ జి.భాను మూర్తి తెలియజేశారు. విటమిన్ ఏ ఉన్న ఆకుకూరలు క్యారెట్ పాలు గుడ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. పోషకాహారం లోపం లేకుండా బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలన్నారు.దీనిలో భాగంగా ఆదివారం సన్ స్టార్ స్కూల్ ప్రాంగణంలో 110 మందికి పైగా ప్రజలకు ఉచిత కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.హ్యుమానిటీ ఫౌండేషన్ మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ గౌరవ అధ్యక్షులు, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ హసీం బేగ్ హ్యుమానిటీ ఫౌండేషన్ ఫౌండర్ నూర్జహాన్ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కృష్ణాజిల్లా విద్యా నిధి కన్వీనర్ పి. శ్రీరామ్,డాక్టర్ భాను మూర్తి ప్రెసిడెంట్ కిషోర్ వైస్ ప్రెసిడెంట్ బి.అయ్యప్పస్వామి, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, హజ్ కమిటీ చైర్మన్ అజీమ్ ముదిగొండ శాస్త్రి, ప్రముఖ సంఘ సేవకురాలు, అన్నపూర్ణ వృద్ధాశ్రమ వ్యవస్థాపకురాలు కరెడ్ల సుశీల, స్టార్ కాలేజీ ప్రిన్సిపల్ ఎమ్. ఎల్ ఆదిత్య పాల్గొన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వారు కోటేశ్వర రావుకి మందుల ఖర్చు నిమిత్తం 10,000 రూపాయలు ఇవ్వటం జరిగింది. వారి జీవితాల్లో వెలుగును నింపడం గర్వకారణ మన్నారు. సేవ మానవతా ధర్మంతో నిర్వహించబడిన కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమం విజయవంతం అయినందుకు, హర్షం వ్యక్తం చేశారు.



## మత్స్యకారులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం : కనపర్తి



**నాగాయలంక నవంబర్ 2 మేజర్ న్యూస్ :** అవనిగడ్డ నియోజక వర్గం నాగాయలంక మండలం సోర్లగొంది గ్రామంలో మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన మత్స్యకారులకు ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఉచిత బియ్యం, నిత్యవసరాల సరుకులను అందజేసి ప్రభుత్వం అన్ని విధాల తోడుగా ఉంటుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు, నాగాయలంక తెలుగుదేశం పార్టీ నాయకులు మెండు లక్ష్మణరావు, పార్టీ నేతలు కొల్లాటి ధనుంజయ్, కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు నాయుడు, రామయ్య పరుచూరి దుర్గాప్రసాద్, బండె రాఘవ, మేడికొండ విజయ్, మంచాలమహేంద్ర తదితరులు పాల్గొని మత్స్యకార,కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు.

## రక్షణ సైనిక దేవాలయంలో దాతల సహకారంతో సౌండ్ బాక్స్‌ల ఏర్పాటు



**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** క్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని గుడివాడ డివిజనల్ కమాండర్ మేజర్ జల్లి మోషే పేర్కొన్నారు. మండల కేంద్రమైన పెదపారుపూడిలోని రక్షణ సైనిక దేవాలయంలో సంఘస్తులు పెయ్యల శ్రీనివాస్ - భాగ్యలక్ష్మి దంపతులు బహుకరించిన సౌండ్ బాక్స్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేవునియందు ప్రేమతో ఉండాలని అటువంటి వారికి ప్రభువు ఎల్లప్పుడూ రక్షణగా నిలుస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దాతలు శ్రీనివాస్-భాగ్యలక్ష్మి దంపతులతో పాటు సంఘ కాపరి మేజర్ విజయ్ కుమార్, మేజర్ రూతు కుమారి, సంఘ పెద్దలు దగాని జోసఫ్, నత్త భూషణ్ కుమార్, గూడపాటి భాస్కరరావు, గృహ సమితి మహిళలు పీకా పద్మ, గుమ్మడి యేసు మరియమ్మ, దగాని గ్రేస్, సంఘస్తులు పాల్గొన్నారు.

## శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో సూర్య నమస్కారాలు మహా లింగార్చన కార్యక్రమాలు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం రాబర్ట్ సన్ పేట మచిలీపట్నంలో ఆదివారం ఉదయం సూర్య నమస్కారాలు మహా లింగార్చన కార్యక్రమంలు జరిగినవి ఇఓ సమ్మెట ఆంజనేయస్వామి ఏర్పాట్లు చేసినారు చైర్మన్, ధర్మ కర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.



**విలేకరులు కావలెను**

నేటి దినపత్రిక సూర్య నందు నందిగామ టౌన్, నందిగామ రూరల్, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999